ప్రజాశక్తి
సోమవారం 11 ఆగస్టు 2025 5 అనంతపురం



గ్రామీణ కళలను కాపాడుకుందాం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గ్రామీణ కళలను కాపాడుకోవడంతో పాటు కళలను ప్రోత్సహించి కళాకారులకు జీవనోపాధి కల్పిద్దామని రిప్స్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం ప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ విజయవాడ సహకారంతో రీప్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుక్కరాయసముద్రం, రోటరీపురం, వెంకటాపురం గ్రామాల్లో కోలాటం, డప్పు నృత్యాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అంతరించిపోతున్న కళలను కాపాడుకునేందుకే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ గ్రామీణ కళలను ప్రోత్సహించాలన్నారు.



డప్పు కొడుతున్న కళాకారులు

దంచికొట్టిన వాన

- ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- పలుచోట్ల తెగిన రోడ్లు, కల్వర్టులు
- రాకపోకలకు అంతరాయం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు రోజులుగా విస్తారంగా వానలు పడుతున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజామున వరకు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసాయి. తాడిపత్రి ప్రాంతంలో అత్యధికంగా వర్షపాతం నమోదయింది. తాడిపత్రి నంద్యాల మార్గంలో అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలో వంక పొంగిపోర్లడంతో రహదారి కొట్టుకుపోయింది. తాడిపత్రి ప్రాంతంలోనే ఓబులేసు కోన, యాడికి మండలంలో కోన ఉప్పలపాడు ప్రాంతంలో జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. గడిచిన నాలుగైదు రోజులుగా జల్లా అంతటా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. ఆదివారం నాడు తాడిపత్రి మండలంలో అత్యధికంగా 72.2 మిల్లిమీటర్లు వర్షపాతం నమోదయింది. నార్పలలో 66.4, పుట్లూరులో 58.8 , యల్లనూరులో 56.8, శెట్టూరులో 55.8, అత్యల్పంగా వజ్రకరూరులో 1.4 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదయింది. జల్లా మొత్తంగా ఆదివారం నాడు 106.5 మిల్లిమీటర్లు వర్షపాతం నమోదయింది. సత్యసాయి జల్లాలోనూ అత్యధికంగా వర్షాలు పడుతున్నాయి. చెన్నేకొత్తపల్లి మండలం గంగినేపల్లిలో వంకలు పెద్ద ఎత్తున పొంగడంతో రహదారి. కల్వర్టులు దెబ్బతిన్నాయి. దీంతో ఐదు గ్రామాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ప్రజాశక్తి యంత్రాంగం

తాడిపత్రిలో వర్ష బీభత్సం

శనివారం రాత్రి కురిసిన ఏకదాటి వర్షానికి తాడిపత్రి మండల పరిధిలోని వాగులు వంకలు నిండి పొంగిపొర్లాయి.కొన్ని రహదారులు తెగిపోయాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అంతేకాకుండా గ్రావెల్‌తో నిండిన కొండగుట్టలు విరిగిపడ్డాయి. రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ఆదివారం పెన్నా నదికి నీరు వచ్చి పరవళ్లుతొక్కుతోంది. మండలంలోని వంకలు, వాగులు నిండి గ్రామాలకు వెళ్లే దారులు మూసుకుపోయాయి. ప్రధానంగా తాడిపత్రి నంద్యాల ప్రధాన రహదారిపై బుగ్గ సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న 544 – డి హైవే బ్రిడ్జ్ పనులు జరుగుతుండగా అక్కడ సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే అక్కడి వంకకు పెద్ద ఎత్తున నీరు చేరుకోవడంతో వేసిన సర్వీస్ రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో తాడిపత్రి – నంద్యాల ప్రధాన రహదారి పై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి రాకపోకలు స్తంభించాయి. అటు బనగానపల్లె, నంద్యాల, కోవెలకుంట్ల వైపు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇలా దాదాపు తెల్లవారుజామున సుమారు మూడు గంటల నుంచి నిలిచిపోయిన వాహనాలు ఉదయం 10:00 అయినప్పటికీ అక్కడే ఉండిపోయాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదేవిధంగా తాడిపత్రి నుండి ఓబులేసుకోన, ఊరు చింతల వెళ్లే మార్గంలో ఆవుల తిప్పయి పల్లి గ్రామం వద్ద వంకకు నీరు అధికంగా చేరడంతో ఆ దారిలో వెళ్తున్న ఓ జీపు నీటి ఉధృతికి అటువైపు వెళ్లలేకపోయింది దీంతో అప్రమత్తమైన డ్రైవర్ వాహనం దిగి పక్కకు రాగా జీపు వంకలో కొట్టుకుపోయింది. దీంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. అదేవిధంగా మండల పరిధిలోనిఆలూరు కోన నందు అక్కడున్న గ్రావెల్ మట్టి వర్షపు నీటికి కరిగి కొండ చరియలు విరిగిపడ్డాయి. దీంతో గ్రావెల్ మట్టి కింద పార్కు చేసి ఉన్న వాహనాలకు మట్టి పేరుకుపోయింది. అలాగే అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ సమీపంలో ఉన్న దేవరకోనకు వర్షపు నీరు అధికంగా రావటంతో అక్కడ జలపాతం ఉధృతంగా మారింది. రెండు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని చిన్న పెద్ద వంకలు వాగులు నీటితో నిండిపోయాయి.

ధర్మవరం డివిజనలో భారీ వర్షం

ధర్మవరం రెవిన్యూ డివిజన్‌లో నాలుగు రోజులు నుండి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ధర్మవరం మండలంలో 34.6 మిల్లీమీటర్లు, బత్తలపల్లి మండలంలో 36.2, తాడిమర్రిలో 47.2, ముదిగుబ్బలో 32.2, కనగానపల్లిలో 10.2, సి కే పల్లి లో 42.6, రామగిరి మండలంలో 2.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. డివిజన్ మొత్తంగా 205.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. ధర్మవరం మండల పరిధిలో కురిసిన భారీ వర్షాలకి పోతులనాగేపల్లి వద్ద చిత్రావతి నది ఆదివారం ఉదయం పొంగి ప్రవహించింది. ఈ ప్రవాహం వలన ధర్మవరం చెరువుకి భారీగా నీరు చేరుతోంది.

విరిగిపడిన కొండ చరియలు

ఆదివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి తాడిమర్రి మండలం దాడి తోట పులివెందుల ప్రధాన రహదారిపై గల పులుట్ల కనుమ వద్ద కొండ చరియలు ఒక్కసారిగా ప్రధాన రహదారిపై విరిగిపడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



తాడిపత్రి మండలంలోని బుగ్గ సమీపంలో తెగిపోయిన సర్వీసురోడ్డు

దెబ్బతిన్న గంగినేపల్లి బ్రిడ్జి

శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చెన్నేకొత్తపల్లి మండలం గంగినేపల్లి బ్రిడ్జి దెబ్బతింది. దీంతో గంగినేపల్లి, ఎర్రోనిపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాలతో పాటు ఎస్టీ కాలనీల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

యల్లనూరులో భారీ వర్షం

శనివారం రాత్రి యల్లనూరు మండలంలో భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి.అలాగే ఎగువ ప్రాంతం లో కురిసిన వర్షాలకు చిత్రావతి నది ప్రవహిస్తోంది.

కొత్త చెరువులో భారీ వర్షం

శనివారం రాత్రి భారీ వర్షం రావడంతో వాగులు వంకలు పొంగి ప్రవహించాయి. రాత్రి కురిసిన వర్షం జిల్లాలోనే అత్యధిక 76.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

గాలివానకు నేలకొరిగిన అరటి పంట

:కంబదూరు మండలం రాంపురం గ్రామంలో కమ్మ వెంకటేశులకు సంబంధించిన నాలుగు ఎకరాల అరటిపంట గాలివానకు నేలపాలైంది.



ధర్మవరం మండలంలోని పోతులనాగేపల్లి వద్ద చిత్రావతి ప్రవాహం



తాడిమర్రి మండలం పులుట్ల కనుమ వద్ద రోడ్డుపైకి విరిగిపడిన కొండచరియలు



యల్లనూరు మండలంలో నీటమునిగిన పంట పొలాలు

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగరంలోని భూకబ్జా రాయుళ్లపై చర్యలు తీసుకుని బాధితులను కాపాడాలని సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈమధ్యకాలంలో కొంత మంది నాయకుల పేర్లు చెప్పి భూ కబ్జాదారులకు పాల్పడుతున్నా పోలీసు యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయకపోగా వారిపైనే కేసులు పెడతామని బెదిరించడం మంచిది కాదన్నారు. ఎక్కడ చూసినా భూ కబ్జాలు మితిమీరడంతో ప్రశాంతంగా ఉన్న నగరంలోని ఉద్యోగులు, వ్యాపారులు ఆందోళన చెందుతున్నారన్నారు. పోలీస్ యంత్రాంగం నిష్పక్షపాతంగా ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా భూ కబ్జాదారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వారం క్రితమే నగరంలోని తపోవనం వద్ద ఉన్న స్థలంలోకి కొందరు ప్రవేశించి భయ భ్రాంతులకు గురి చేసి బలవంతంగా భూమిని తీసుకునే ప్రయత్నం చేశారని, అది మరవక ముందే సాయినగర్‌లో ఉన్న ఓ మైనారిటీ కుటుంబానికి చెందిన స్థలం వివాదం చోటు చేసుకోవడం తెలిసిందే అన్నారు. అదేవిధంగా నగరంలో అధిక వడ్డీలకు పాల్పడుతున్నా వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఆరోగ్య అవసరాలు, కుటుంబ అవసరాల కోసం కొందరు అధిక వడ్డీ వ్యాపారం దగ్గర డబ్బులు తీసుకుని వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎంత డబ్బులు కట్టినా అసలు మాత్రం తీరడం లేదని తీవ్ర మనోవేదన గురై ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. ఆయా కుటుంబాలకు భరోసా కల్పించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవరిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా భూ కబ్జాదారులు, అక్రమ వడ్డీవ్యాపారులపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.


ప్రత్యామ్నాయ ప్రణాళిక ప్రకటించాలి

చిరుధాన్యాల విత్తనాలు సరఫరా చేయాలి

ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్రణాళిక ప్రకటించడంతోపాటు చిరుధాన్యాల విత్తనాలను సరఫరా చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని రైతుసంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో 3.42లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగులోకి వస్తాయని అధికారుల అంచనా వేసినా 1.50 లక్షల హెక్టార్లలో మాత్రమే పంటలు సాగైనట్లు తెలుస్తోందన్నారు. జూన్‌లో 21.7 మిమీ, జూలైలో 46.4 మిమీ లోటు వర్షపాతం ఏర్పడటంతో పంటలు సాగు చేయక రెండు లక్షలు హెక్టార్లు బీడుగా ఉన్నాయన్నారు. కావున జిల్లాలో ఉన్న ప్రజాప్రతినిధులు పంటల సాగుపై సమీక్ష సమావేశం నిర్వహించాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో కురుస్తున్న వర్షాలకు సాగు చేసేందుకు ప్రత్యామ్నాయ విత్తనాలు సరఫరా చేయాలన్నారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన అన్నదాత సుఖీభవ నిధులు జిల్లాలోని చాలామంది రైతులకు జమ కాలేదన్నారు. అర్హుల జాబితాలో ఉన్న రైతులకు కూడా జమ కాకపోవడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారన్నారు. కావున అర్హులైన రైతులకు అన్నదాత సుఖీభవ సొమ్మును రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.శివారెడ్డి, జి.విరూపాక్షి, ఎన్.మధుసూదన్, జిల్లా సహాయ కార్యదర్శులు బిహెచ్ రాయుడు, డి.దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం నాయకులు

పెన్షనర్లకు అండగా ఉంటాం

విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

మాజీ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు అండగా ఉంటామని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన పెన్షనర్స్ భవనాన్ని పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.పెద్దన్నగౌడ్ ఆధ్వర్యంలో విప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడ్డ రాయదుర్గం అభివృద్ధికి ఏదోవిధంగా చేయూత అందించాలన్న ప్రయత్నాన్ని తాను ఆహ్వానిస్తున్నానన్నారు. బైరవానితిప్ప ప్రాజెక్టుకు కృష్ణాజలాల తరలింపుతోపాటు ఆవులదట్ల, మాల్యం బ్రాంచ్ కాలువల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామన్నారు. పెన్షనర్లు తమ ఆరోగ్యం బాగా చూసుకోవాలని కోరారు. పెన్షనర్స్ రాయదుర్గం ప్రజలు బాగుండాలని కోరుకుంటూ సామాజిక కార్యక్రమాలు చేపట్టడానికి ముందుకు వస్తుండటం హర్షించదగ్గ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షన్ల సంఘం అధ్యక్షులు ఈ రామాంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు అబ్దుల్ కరీం, జిల్లా ప్రధాన కార్యదర్శి శీల జయరామప్ప, రాయదుర్గం శాఖ కార్యదర్శి జి సత్యనారాయణ, కోశాధికారి నాగరాజు శెట్టి, ప్రముఖ వైద్యులు ఆత్మకూరు గోపాలరావు, పెన్షనర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను చేనేతలు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి బి. రామకృష్ణ



ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతలకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి చెందాలని జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి బి. రామకృష్ణ తెలిపారు. జిల్లాలో వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది చేనేత పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. వారి అభివృద్ధి కోసం ప్రభుత్వాలు ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నాయి. అయినప్పటికీ ఆ వృత్తిలో ఉన్న వారు కొందరు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముడి సరుకు ధరలు పెరగడం, తాము నేసిన బట్టకు తగిన గిట్టుబాటు ధర రాకపోవడం, బయట అధిక వడ్డీలకు రుణాలు పొంది వాటి నుంచి బయటపడలేక ఆత్మహత్యకు పాల్పడడం లాంటి సంఘటనలు చూస్తూనే ఉన్నాము. ఇటీవలనే ధర్మవరంలో చేనేత కార్మికుడు అధిక వడ్డీ చెల్లించలేక పోవడంతో వడ్డీ వ్యాపారి తన అనుచరులతో ఆ కుటుంబం పై దాడి చేసిన విషయం తెలిసిందే. శ్రీ సత్య సాయి జిల్లాలో అధికంగా చేనేతలు ధర్మవరం, సోమందేపల్లి, హిందూపురం, పుట్టపర్తి తదితర ప్రాంతాలలో మగ్గాలపై ఆధారపడి జీవిస్తున్నారు. ధర్మవరం చేనేత వస్త్రాలు ప్రపంచ ప్రఖ్యాతి పొందాయి. ఇటీవలనే ఒక జిల్లా ఒక ఉత్పత్తిపై సత్యసాయి జిల్లా ఎంపిక కాగా మంత్రి సవితమ్మ, కలెక్టర్ టిఎస్ చేతన్ ఢిల్లీలో అవార్డును అందుకోవడం జరిగింది. ఈ నేపథ్యంలో జిల్లాలో చేనేతల స్థితి గతులు, వారికి అందిస్తున్న పథకాలు తదితర అంశాలపై జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి బి. రామకృష్ణ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను వెల్లడించారు.

ప్రశ్న : జిల్లాలో ఎంతమంది చేనేత కార్మికులు ఉన్నారు? అన్ని మగ్గాలు ఉన్నాయి?

జవాబు : జిల్లాలో వ్యవసాయం తర్వాత ఉపాధి కల్పిస్తున్న చేనేత పరిశ్రమ ద్వితీయ స్థానంలో ఉంది. దీనిపైనే ఆధారపడి జిల్లాలో 33, 274 మంది కార్మికులు ఉన్నారు. 28,500 చేనేత మగ్గాలు ఉన్నాయి. ఎక్కువగా ధర్మవరం, సోమందేపల్లి, హిందూపురం దగ్గర ముదిరెడ్డిపల్లి, పుట్టపర్తి తదితర ప్రాంతాల్లో చేనేత మగ్గాలు ఉన్నాయి.

ప్ర : చేనేతలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించండి?

జ : చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారికి చేనేత ముద్ర పథకం ద్వారా బ్యాంకుల నుంచి రుణ సౌకర్యం కల్పించడం జరుగుతుంది. రూ.50 వేల నుంచి 2 లక్షల రూపాయల వరకు రుణాలు ఇవ్వడం జరుగుతుంది. ఇందులో 20 శాతం వరకు సబ్సిడీ ఉంటుంది. 2025 – 26 ఆర్థిక సంవత్సరంలో రుణాలు మంజూరు కొరకు జిల్లాలో 75 మంది నుంచి దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 15 మంది చేనేత కార్మికులకు 16 లక్షల రూపాయలు రుణం అందించడం జరిగింది. మిగిలినవారికి త్వరలో మంజూరు కానున్నాయి. అంతేగాక 50 ఏళ్లు నిండిన చేనేత కార్మికులకు ఎన్టీఆర్ భరోసా పథకం కింద 12,712 మందికి పింఛన్లు మంజూరు కాగా ప్రతినెల ఒక్కొక్కరికి రూ. 4 వేలు పింఛను అందించడం జరుగుతుంది.

ప్ర : చేనేతల నైపుణ్య అభివృద్ధికి ఏమి చర్యలు తీసుకుంటున్నారు?

జ : సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న దశలో చేనేతలకు మరింత నైపుణ్యం పెంపొందించడానికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. హిందూపురంలో తెలుగు చేనేత పరిశ్రమ శిక్షణ కేంద్రంలో 30 మంది చేనేతలకు జాకార్డు వీలింగ్‌లో శిక్షణ ఇవ్వబడింది. 60 మంది మహిళలకు నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ ఇప్పించి కుట్టుమిషన్లు పంపిణీ చేయడం జరిగింది. అలాగే సోమందేపల్లికి చెందిన 30 మంది కార్మికులకు విజయవాడ వీలింగ్ సెంటర్ నందు శిక్షణ ఇవ్వడం జరిగింది.

ప్ర : చేనేత క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమాలు గురించి వివరించండి?

జ: సోమందేపల్లిలో రూ. 116.62 లక్షలతో 164 మంది చేనేత కార్మికులకు క్లస్టర్ ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే హిందూపురం చేనేత క్లస్టర్ మంజూరు అయింది. నిధుల విడుదల కాగానే ఆ క్లస్టర్ ద్వారా కార్మికులు అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంది. ధర్మవరంలో మెగా చేనేత క్లస్టర్ కొరకు రూ.35 కోట్లతో ప్రతిపాదనలు పంపడం జరిగింది. అలాగే రెండు చిన్న క్లస్టర్లు క్రింద సి.కె. పల్లి, నల్లచెరువులో ఏర్పాటుకు కార్మికులకు పనిముట్లు వర్క్ షెడ్లు కొరకు ప్రతిపాదనలు పంపడం జరిగింది. అలాగే డి సి హెచ్ ఎన్ హెచ్ డిపి క్రింద గోరంట్ల, పెనుకొండ, పరిగి, రొద్దం, సోమందేపల్లి లో ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదించడం జరిగింది.

ప్ర: చేనేతలకు ఉచిత విద్యుత్ పథకం ఎప్పటి నుంచి అమలు అవుతుంది?

జ : ఈనెల 7న చేనేత దినోత్సవం సందర్భంగా చేనేతలకు ఉచిత విద్యుత్ ఆ రోజు నుంచి అమలు అవుతుంది. అందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోంది. చేనేతలకు 200 యూనిట్లు మరమగ్గాలకు 500 యూనిట్లు వరకు ఉచితంగా విద్యుత్తును పొందనున్నారు. జిల్లాలో 7,177 చేనేత కుటుంబాలు 2001 పవర్ లూమ్స్‌కు ఈ ఉచిత విద్యుత్ లబ్ధి చేకూరనుంది.

ప్ర: ఇటీవల జిల్లాకు అవార్డు రావడం గురించి తెలపండి?

జ : ధర్మవరం పట్టుచీరలకు ఈ గౌరవం దక్కింది. ఒక జిల్లా ఒక ఉత్పత్తి కార్యక్రమం క్రింద అవార్డు రావడం జరిగింది. ప్రతిష్టాత్మక ఈ అవార్డును న్యూఢిల్లీలో కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ చేతులు మీదుగా రాష్ట్ర బీసీ సంక్షేమ, జౌలి శాఖ మంత్రి సవితమ్మ, జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ఇటీవల ఈ అవార్డు అనుకున్నారు. ఇది మన జిల్లాకు దక్కిన గౌరవంగా భావించవచ్చు.

ప్ర : చేనేతలకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి?

జ : ప్రభుత్వాలు అందించే పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలి. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో మరిన్ని శిక్షణనలు పొంది నైపుణ్యం పెంపొందించుకోవాలి. బయట అధిక వడ్డీలకు రుణాలు తీసుకోరాదని కోరుతున్నాం.



జిల్లా చేనేత, జౌలిశాఖ అధికారి బి. రామకృష్ణ

20ఏళ్ల రైతుల కల సాకారం

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-పుట్లూరు

20ఏళ్ల రైతుల సాగునీటి కలను సాకారం చేసిన ఘనత సిఎం చంద్రబాబుకు దక్కుతుందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. ఆదివారం మండలంలోని సుబ్బరాయసాగర్ నుంచి బొప్పేపల్లి చెరువుకు 0.100 టిఎంసి నీరు కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలో భాగంగా జంగిల్ క్లియరెన్స్, పూడికతీత పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుబ్బరాయ సాగర్ నుంచి బొప్పేపల్లి చెరువు వరకు సాగునీటిని సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం కాలువను వెడల్పు చేస్తూ పిచ్చి మొక్కలు, కంపచెట్లను తొలగిస్తూ జంగిల్ క్లీనింగ్ పనులు చేపట్టినట్లు వివరించారు. అలాగే కాలువ సాగునీటి పారుదలకు ప్రధాన అడ్డంకిగా ఉన్న బండరాళ్లు, వ్యర్థాల తొలగింపు, మరమ్మతులు చేసి చివరి ఆయకట్టు భూముల వరకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. పంటలు పుష్కలంగా పండి రైతులు ఆనందంగా ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. బొప్పేపల్లి రైతులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తమ ఏళ్ల కలను సాకారం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి రామానాయుడు, ఎమ్మెల్యే ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డుపై వర్షం నీరు...మొక్కలు నాటి నిరసన



వర్షం నీటిలో మొక్కలు నాటి నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

డ్రైనేజీ కాలువలు నిర్మించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని అమ్మలదిన్నె ఎస్సీ కాలనీలో నిల్వ ఉన్న వర్షం నీటిలో మొక్కలు నాటి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప మాట్లాడుతూ మండలంలోని అమ్మలదిన్నె ఎస్సీ కాలనీపై అధికారులు చిన్నచూపు చూడటం తగదన్నారు. కనీస మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతోందన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో కాలనీలో సిసి రోడ్లు వేయాలని ఉన్న రోడ్లను పగులగొట్టి అలాగే వదిలేశారన్నారు. సైడ్ కాలవలు, సిసి రోడ్లు లేక చిన్నపాటి వర్షం వచ్చినా కాలనీ చిన్నపాటి కుంటను తలపిస్తుందన్నారు. మురికినీటితో దోమలు ఎక్కువై స్థానికులు రోగాల బారిన పడుతున్నారన్నారు. అలాగే వీధిలైట్లు లేక రాత్రిళ్లు బయటకు రావాలంటే జంకుతున్నారన్నారు. గండికోట నీరు వస్తున్నా తాగునీటికి కూడా ఇబ్బందులు పడటం బాధాకరమన్నారు. అదే ఒకే కాలనీలో కొళాయి తిప్పితే చాలు నీళ్లు వస్తున్నాయన్నారు. ఈ సమస్యపై స్థానిక పంచాయతీ కార్యదర్శి, తహశీల్దార్, ఎంపిడిఒల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. వెంటనే కనీసం ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి అయినా స్పందించి ఎస్సీ కాలనీలను సందర్శించి సిమెంటు రోడ్లు, సైడ్ కాలువలు, వీధిలైట్లు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో కాలనీవాసులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు జయమ్మ, కమిటీ సభ్యులు ఈశ్వరయ్య, ఐషు, నాగేశ్వరరావు, రామాంజి, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణలో మాట్లాడుతున్న వక్తలు

'సుల్తాన్ వారసులు' పుస్తకం ఆవిష్కరణ

అనంతపురం : నగరంలోని రుద్రంపేటలోని ఆర్ కన్వెన్షన్ హాల్లో 'సుల్తాన్ వారసులు' జనాబ్ కెఎం సఫీఉల్లా ఆత్మకథ పుస్తకాన్ని మాజీ డీజీపీ ఎకె ఖాన్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారసులు సుల్తాన్ కుటుంబం గొప్పదనం, సేవాగుణాన్ని ప్రశంసించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపి కెఎం సైఫుల్లా, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మేయర్ వసీం, డీఆర్వో మలోల, న్యాయవాది సంపత్ కుమార్, ప్రభుత్వ వైద్యులు రామ్మోహన్ చౌదరి, కెఎం సఫీ ఉల్లా సతీమణి షమీం, సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంభూపాల్, ఐద్వా రాష్ట్ర నాయకులు సావిత్రి, పుస్తక రచయిత గుంటి మురళీకృష్ణ భరద్వాజ్, ఆజాద్ నాయకులు వలి, కాంగ్రెస్ పార్టీ నాయకులు దాదాగాంధీ పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు పూర్తి చేయాలి

రాయదుర్గం : పట్టణంలో అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లను ఆరునెలల్లోగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌని ప్రతాప్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం పట్టణంలో అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018లో టిడిపి ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసిన ఇళ్లు నేటికీ పూర్తి చేయకపోవడం దుర్మార్గమన్నారు. గతంలో సెల్ఫీ చాలెంజ్ పేరుతో వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాలవ శ్రీనివాసులు ఇళ్ల నిర్మాణాలను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వెంటనే ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అనిల్ కుమార్, జయన్న, బిలాల్, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కొరతను నివారించాలి

బెళుగుప్ప : రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలకు సరఫరా చేస్తున్న ఎరువుల్లో 70 నుంచి 80 శాతం ప్రయివేటు వ్యాపారులకు కేటాయిస్తున్నారన్నారు. సొసైటీలు, డిసిఎంఎస్‌లకు అరకొరగా కేటాయించడంతో ప్రయివేటు వ్యాపారస్తులు ఎరువుల కొరతను సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

ధర్మకర్తల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

నార్పల : మండల పరిధిలోని గూగూడు గ్రామంలో వెలసిన కుళ్లాయిస్వామి దేవస్థానం ఆలయ ధర్మకర్తల నియామకానికి దరఖాస్థులు స్వీకరిస్తున్నట్లు ఆలయ ఇఒ ఎస్.శోభ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 25వతేదీలోపు జిల్లా దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని కోరారు.

జెఎల్‌ఎంలకు ఎపిఎస్ఇబి సర్వీస్ అమలు చేయాలి



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

విద్యుత్ సంస్థలో పని చేస్తున్న జూనియర్ లైన్‌మెన్‌లు (జెఎల్‌ఎం)-2లకు ఎపిఎస్‌ఇబి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని గ్రామ, వార్డు సచివాలయాల ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్-5 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, జిల్లా కన్వీనర్ వెంకటేష్‌నాయక్, డివిజనల్ గౌరవాధ్యక్షులు గోపాల్, ఎలక్ట్రిసిటీ స్టాఫ్, వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఇబ్రహీం డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అక్కమాంబ ఆలయ సమీపంలో జెఎల్‌ఎం గ్రేడ్-2 ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జెఎల్‌ఎం గ్రేడ్-2 ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. జెఎల్‌ఎంలు గ్రేడ్-2 ఉద్యోగులు విధి నిర్వహణలో సుమారు 120 మంది ప్రాణాలు కోల్పోయారని, మరికొంత మంది అంగవైకల్యం చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. పాత, కొత్త ఉద్యోగుల మధ్య రెండు రకాల సర్వీసులు అమలు చేయడం చట్ట విరుద్ధమన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16 ఉల్లంఘనకు దారి తీస్తుందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు గోవిందరెడ్డి, శ్రీనివాసులు, నాగరాజు, అమరేష్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం

యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు



జెండాను ఎగురవేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతోపాటు విద్యారంగం పరిరక్షణకు పోరాడే ఏకైక ఉపాధ్యాయ సంఘం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) అని ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు, సీనియర్ నాయకులు మహమ్మద్ జిలాన్, ఈశ్వరయ్య, కోటేశ్వరప్ప అన్నారు. ఆదివారం యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అనంతపురంలోని జిల్లా కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్థాపించినట్లు తెలిపారు. ఆనాటి నుంచి ఇప్పటి వరకు అనేక ఉద్యమాలు చేసినట్లు వివరించారు. ముఖ్యంగా విద్యా రంగం, ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూ, అనేక సౌకర్యాలను సాధించిన సంఘంగా, రాష్ట్రంలో లక్ష సభ్యత్వం కలిగిన ఏకైక సంఘం యుటిఎఫ్ అన్నారు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలపై గొంతెత్తి ప్రశ్నిస్తున్నట్లు వివరించారు. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఎలు, పిఆర్‌సి, అరియర్స్, నూతన పిఆర్‌సి కమిటీ వేసి, మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర మాజీ కార్యదర్శి వి.కోటేశ్వరప్ప, సీనియర్ నాయకులు కె.నాగేంద్ర, గంగాధర్, వెంకటనాయుడు, ఓబుళపతి, రోగప్ప, శ్రీనివాసులు, కృష్ణయ్య, ముత్యాలప్ప, రమేష్, రామ్మూర్తి, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి కోసం చేయూతనందించండి

జెవివి ఆడిట్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ సాకే భాస్కర్



మాట్లాడుతున్న సాకే భాస్కర్

ప్రజాశక్తి-రాయదుర్గం

దేశ సమైక్యత, సమగ్రత, స్వావలంబన కోసం ఏర్పడిన జనవిజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరి చేయూతనందించాలని జెవివి ఆడిట్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ సాకే భాస్కర్ పిలుపునిచ్చారు. ఆదివారం రాయదుర్గంలోని సమైక్యాంధ్ర భవన్‌లో జెవివి రాయదుర్గం శాఖ అధ్యక్షులు ఎంజి వీరన్న అధ్యక్షతన జోనల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మూడున్నర దశాబ్దాల క్రితం జెవివి ఏర్పడిందన్నారు. భోపాల్‌లో సైన్స్ దుర్వినియోగం కారణంగా యూనియన్ కార్బైడ్ పరిశ్రమలో మారణహోమం అనంతరం మానవ కళ్యాణం కోసం సైన్స్ ఉద్దేశంతో ఏర్పడినదే జెవివి అన్నారు. అప్పటి నుంచి రెండేళ్లకోసారి రాష్ట్రస్థాయిలో జరిగే మహాసభలకు ముందు స్థానిక సభలు జరుగుతాయన్నారు. ఈ రెండేళ్లలో జరిగిన కార్యక్రమాలను మననం చేసుకుని రాబోవు రెండేళ్లలో ఆశయాలు, కార్యక్రమాలను రూపొందించుకుని ముందుకెళ్తున్నట్లు వివరించారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెంచే లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రజల్లో గ్రహణాలు, మాయలు, మంత్రాలను ప్రశ్నించేతత్వాన్ని, సైన్స్ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిరంతర కృషి చేస్తున్నట్లు చెప్పారు. మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని, కట్టుబాట్లు ప్రగతికి, పురోగతికి అవరోధం అన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో కర్నూలు జిల్లా హెల్త్ సబ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ ముత్యాల సుధాకర్‌రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆంధ్ర ఉపన్యాసకులు వీరేష్, రిటైర్డ్ హెడ్మాస్టర్ శివప్ప, గౌరవాధ్యక్షులు అయూబ్‌ఖాన్, జగదీష్, శివానంద, కార్యవర్గ సభ్యులు, మేధావులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధిస్తాం

మాజీ ఎంపీపీ కోనా



వైసిపి నాయకులతో మాజీ ఎంపిపి కోనా దంపతులు

ప్రజాశక్తి-గుత్తి

స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి విజయకేతనం ఎగరవేస్తోందని వైసిపి డోన్ ఎన్నికల పరిశీలకులు, గుత్తి మాజీ ఎంపీపీ కోనా మురళీధర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్‌రెడ్డి వివాహం హైదరాబాదులో జరిగింది. వివాహానికి కోనా మురళీధర్‌రెడ్డి అనంతరం వైసిపి నేత సజ్జల రామకృష్ణారెడ్డి, టీటీడీ మాజీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, మాజీ మంత్రులు ఎస్.రఘువీరారెడ్డి, ఆర్కే రోజా, విడదల రజినిని వేర్వేరుగా కలిశారు. వారితో రాష్ట్ర రాజకీయాలపై చర్చించారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే వైసీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోనా మురళీధర్‌రెడ్డి సతీమణి కోన శ్రీలతారెడ్డి, తనయుడు కోనా నిశాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్‌లో విద్యార్థుల సత్తా



చెస్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

అనంతపురం : నైట్ కాజిల్స్ చెస్ అకాడమీ వారు గుంటూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన 6వ రాష్ట్ర ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్-2025లో అనంతపురం విద్యార్థులు సత్తాచాటారు. ఈ టోర్నీలో రాష్ట్రవ్యాప్తంగా 200 మందిపైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో అనంతపురంలోని ఏ1 చెస్ అకాడమీ క్రీడాకారులు వివిధ విభాగాల్లో రాణించారు. అండర్ -14 ఓపెన్ విభాగంలో రన్నరప్‌గా జొన్నగడ్డల నితీష్‌చౌదరి, అండర్-06 బాలికల విభాగంలో వేదశ్రీ రెడ్డి 6వ స్థానం, అండర్-10 బాలికల విభాగంలో జనని కొనకొండ్ల 6వ స్థానం, అండర్-8 ఓపెన్ విభాగంలో అన్విత్‌కు 10వ స్థానం, నిహాల్ నయనంజన్ ఎస్‌కు 14వ స్థానం సాధించి అబ్బురపరిచారు.



నివాళులర్పిస్తున్న ఉమామహేశ్వరనాయుడు

వైసిపి నాయకుడికి మాతృవియోగం

కళ్యాణదుర్గం టౌన్ : వైసిపి నాయకుడు కురుబ మల్లికార్జునకు మాతృవియోగం కలిగింది. మండల పరిధిలోని మల్లాపురం గ్రామానికి చెందిన వైసిపి వైస్ కన్వీనర్ కురుబ మల్లికార్జున తల్లి బాలనాగమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న సీనియర్ నాయకులు ఉమామహేశ్వరనాయుడు ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పచ్చదనాన్ని పెంపొందిద్దాం

ఉరవకొండ : మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంపొందిద్దామని పూర్వ విద్యార్థులు పిలుపునిచ్చారు. ఆదివారం ఉరవకొండ మండల పరిధిలోని పెన్నఅహోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పరిసర ప్రాంతాల్లో కాలసముద్రం గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థులు 50 మంది హెల్పింగ్ హ్యాండ్ అసోసియేషన్ గ్రూపుగా ఏర్పడి 200 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో పెన్నోబిలం దేవస్థానం పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంటుందన్నారు. వాటిని కాపాడుదామని పిలుపునిచ్చారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఒకచోట చేరిన పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని మాల్టస్ స్మిత్ హైస్కూల్‌లో 2001-02లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థులు ఎంఎస్ హైస్కూల్ నుంచి గాంధీ కూడలి మీదుగా రాజీవ్ సర్కిల్ వరకు ప్రదర్శన చేశారు. 23 ఏళ్ల కిందట ఇక్కడ చదివి స్థానికంగా, ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డ వారందరూ ఒకే వేదికపై కలిశారు.అనంతరం స్నేహితులందరూ కలిసి వారి వారి కుటుంబ యోగక్షేమాలను గురించి అడిగి తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలు నెమరు వేసుకుని సంతోషంగా గడిపారు. గతంలో విద్యాబుద్ధులు నేర్పించిన గురువులకు శాలువా, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కాగా పాఠశాలకు రూ.25వేలు విలువజేసే కంప్యూటర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రేమ్‌కిరణ్, ఉపాధ్యాయులు సుగుణమ్మ, పుష్పరాజ్, కమిలిని, శ్యామ్, రేబుక, స్నేహలత, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలపై నిర్లక్ష్య ధోరణి తగదు

విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్నగౌడ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కూటమి ప్రభుత్వం పెన్షనర్ల పరిష్కారంపై నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం తగదని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్నగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక విశ్రాంత భవనంలో నిర్వహించిన పెన్షనర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం వయస్సు రిత్యా ఇస్తున్న అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను తగ్గించిందని, దాన్ని పునరుద్ధరించాలన్నారు. 2018 జూలై నుంచి ఇవ్వాల్సిన కరువు భృతి, పీఆర్సీ బకాయిలు చెల్లించాలన్నారు. నగదు రహిత చికిత్స పూర్తి స్థాయిలో అమలు చేయాలని, రూ.వెయ్యి కోట్లతో కార్పస్‌ఫండ్ ఏర్పాటు చేయాలని, పెన్షనర్లు మరణించిన రోజే అంతక్రియలకు ఇచ్చే మొత్తాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి షీలా జయరామప్ప, ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రభాకర్, స్థానిక నాయకులు మల్లికార్జున, తిప్పేస్వామి, భగవాన్, శివప్రసాద్, కృష్ణమూర్తి, ఇస్మాయిల్, మారెన్న, ఓబుళప్ప, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

గుత్తి : గుంతకల్లు మండల పరిధిలోని ఓబుళాపురం గ్రామ శివారులో గుత్తి-గుంతకల్లు రైలు మార్గంలో రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. గుత్తి జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలిలా మేరకు గుంతకల్లు మండలం ఓబుళాపురం గ్రామానికి చెందిన రామకృష్ణ కొన్నిరోజులుగా కడుపునొప్పితో బాధ పడుతుండేవాడు. పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్న వ్యాధి నయం కాలేదు. దీంతో విసిగిపోయిన అతడు శనివారం అర్ధరాత్రి ఇంటి నుంచి వచ్చేశాడు. గ్రామ శివారులోని రైలు పట్టాల పక్కన తన పాదరక్షలు విడిచి రైలు కింద పడి మృతి చెందాడు. ఆదివారం ఉదయం మతదేహాన్ని గమనించిన స్థానికులు, రైల్వే కార్మికులు వెంటనే జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించారు. జీఆర్పీ ఎస్సై నాగప్ప, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వా సుపత్రికి తరలించారు. జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గాయపడిన మహిళ మృతి



గంగమ్మ (పాతచిత్రం)

కళ్యాణదుర్గం టౌన్ : పది రోజుల క్రితం కంబదూరులో జరిగిన రోడ్డులో ప్రమాదంలో గాయపడి గంగమ్మ (34) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం తెల్లవారుజామున మృతిచెందింది. మండల పరిధిలోని ఎర్రంపల్లి గ్రామానికి చెందిన మనోహర్, గంగమ్మ పట్టణంలో పని ముగించుకుని ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వెళ్లుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో తలకు గాయాలైన గంగమ్మను అనంతపురంలోని సన్‌రే ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అయినా పరిస్థితి విషమించి మృతిచెందింది.

రస్తా విషయంలో ఘర్షణ

పలువురికి గాయాలు



గాయపడిన జోగినాయనపల్లి గ్రామస్తుడు

తాడిపత్రి రూరల్ : రస్తా విషయంలో రెండు గ్రామాల మధ్య ఘర్షణ జరిగిన ఘటన మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి, జోగినాయినిపల్లి గ్రామాల మధ్య ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. జోగినాయనపల్లి వద్ద ఉన్న వంకలోకి వెళ్లేందుకు బ్రాహ్మణపల్లి గ్రామస్తులు జెసిబితో దారిని చేసుకుంటూ గుంతలకు రాళ్లు నింపడానికి పలు ట్రాక్టర్లతో పనులు చేయిస్తున్నారు. ఈనేపథ్యంలో తమ గ్రామ సరిహద్దులో దారి చేయడానికి వీలు లేదంటూ జోగినాయినిపల్లి గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. పరిస్థితి విషమించి ఇరువర్గాలు కట్టెలతో కొట్టుకుంటూ రాళ్లతో రువ్వుకున్నాయి. జోగినాయనపల్లి గ్రామస్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయమై రూరల్ పోలీసులు ఇరువర్గాల మధ్య రాజీ కుదిరించే ప్రయత్నాలు చేపట్టారు.

రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకోవాలి

రెండు గ్రామాల మధ్య ఘర్షణకు దారితీసిన రస్తా విషయంలో రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకోవాలని ఎపి రైతు సంఘం నాయకులు రాజారామిరెడ్డి సూచించారు. ఒక గ్రామంపై మరో గ్రామం ఆధిపత్యం చెలాయించడం వల్లే ఘర్షణకు దారితీసిందన్నారు. దీనిపై తక్షణమే రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకుని ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా చేసేలా చర్యలు చేపట్టాలన్నారు.

నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా

అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం

గత ఎన్నికల్లో ప్రజలు తనను ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించినందుకు నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలను ఆదివారం నియోజకవర్గ వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ముందుగా దగ్గుపాటి నివాసంలో ఉదయం వేద పండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం రైల్వేస్టేషన్ మార్గంలోని వెంకటేశ్వరస్వామి, కోర్టు రోడ్డులో ఉన్న వరదాంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత దగ్గుపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన కుమార్తె ఆశ్రిత రోగులు, బంధువులకు అన్నదానం, పాలు బ్రెడ్డు పంపిణీ చేశారు. నారాయణపురంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనాథాశ్రమంలో వస్త్రదానం, స్కూల్ పిల్లలకు యూనిఫామ్ పంపిణీ చేశారు. టిడిపి నాయకులు పండ్లతో ఏర్పాటు చేసిన భారీ గజమాలతో ఎమ్మెల్యేను సన్మానించారు. భారీ కేక్ కోసి కార్యకర్తలకు తినిపించారు. పార్టీ కార్యాలయం వద్ద రెడ్‌క్రాస్‌తోపాటు ఆలంబన జనార్ధన్ ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన కల్పించారు. ముందుగా తన నేత్రాలను దానం చేసి ఎమ్మెల్యే దగ్గుపాటి స్ఫూర్తిగా నిలిచారు. ఎమ్మెల్యే తోపాటు వారి సతీమణి శ్రీలక్ష్మి, కుమార్తె అశ్రితలు నేత్రదానానికి ముందుకొచ్చారు. మనం చనిపోయిన తర్వాత మనకు వెలుగునిచ్చే విధంగా దేవుడు మంచి అవకాశం ఇచ్చారని, ప్రతి ఒక్కరూ నేత్రాలను దానం చేయాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు తనకు వచ్చిన ఈ ఎమ్మెల్యే పదవి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెట్టిన భిక్ష అని అన్నారు. తనకున్న ఈ స్థాయికి కారణం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ అన్నారు. ఎప్పటికీ వారికి రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, దగ్గుపాటి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

అనంతపురం : ప్రజల మనస్సుల్లో నిలవడంతోపాటు అనంతపురం అభివృద్ధికి అంకితభావంతో పని చేస్తున్న నాయకుడు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్ అని 45వ డివిజన్ ఇన్‌ఛార్జి ఆర్‌ఎస్ చరిత కొనియాడారు. ఎమ్మెల్యే దగ్గుపాటి పుట్టినరోజును పురస్కరించుకుని ఆదివారం నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న అంజనేయస్వామి ఆలయంలో 108 కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే కృషి, ఆశయ సాధనతో భవిష్యత్తులో అనంతపురం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అలాంటి ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి సీనియర్ నాయకులు, యువ నాయకులు పాల్గొన్నారు.



గజమాలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న నాయకులు

జనసేన భవాని ఆధ్వర్యంలో..


జనసేన నాయకులు భవాని రవికుమార్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అభివృద్ధిని కాంక్షించి అడుగులు వేసే దగ్గుపాటి వెంట జనసేన ఎల్లవేళలా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గల్లా హర్ష, జనసేన నాయకులు మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంగా తేజస్విని వాల్మీకి ఆధ్వర్యంలో..

ఎపి తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని వాల్మీకి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా భారీ కేక్ కోసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తేజస్విని భర్త పవన్‌కుమార్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేతో కేక్ కోయిస్తున్న సంగా తేజస్విని



ఆంజనేయస్వామి ఆలయం వద్ద టెంకాయలు కొడుతున్న దృశ్యం